క్లుప్తంగా

మున్సిపల్ కమిషనర్ బాధ్యతల స్వీకరణ


సాంబశివరావు

రేపల్లె రూరల్: రేపల్లె మున్సిపల్ కమిషనర్‌గా కె.సాంబశివరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గుంటూరు కార్పొరేషన్ కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా విధులు నిర్వర్తిస్తూ బదిలీపై రేపల్లె విచ్చేశారు. ఇక్కడ కమిషనర్‌గా విధులు నిర్వర్తిస్తున్న శేషాద్రి విశాఖపట్నానికి బదిలీ అయ్యారు. బాధ్యతలు స్వీకరించిన సాంబశివరావుకు కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. నూతన కమిషనర్ సాంబశివరావు మాట్లాడుతూ పట్టణంలో పారిశుద్ధ్య సమస్య తలెత్తకుండా నిరంతరం పర్యవేక్షించటం జరుగుతుందని చెప్పారు.

పారిశుద్ధ్య పనులు ముమ్మరం



అమృతలూరు(భట్టిప్రోలు): అమృతలూరు గ్రామ పంచాయతీ పరిధిలో పారిశుద్ధ్య పనులను ముమ్మరం చేశారు. సర్పంచ్ దేవరకొండ రాము ప్రత్యేక శ్రద్ధ తీసుకుని తుఫాన్ వల్ల కొద్ది రోజులుగా కురుస్తున్న అకాల వర్షాల నేపథ్యంలో 14 వార్డులలో పూడుపోయిన కాల్వల్లో సోమవారం మురుగు తొలగింపజేశారు. ప్రత్యేకంగా పారిశుద్ధ్య కార్మికులను తీసుకు వచ్చి కచ్చా కాల్వల్లో పూడిక తీసి బ్లీచింగ్, సున్నం చల్లించారు. కార్యక్రమంలో జేపీఏ తిరుమలరావు, బిల్ కలెక్టర్ రిజ్వాన్‌బాబు, పారిశుద్ధ్య కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ తైక్వాండో పోటీలకు వినూత్న ఎంపిక




తెనాలిఅర్బన్: ఖేలో ఇండియా ఉమెన్ తైక్వాండో జాతీయ స్థాయి పోటీలకు తెనాలి యూనిక్ తైక్వాండో అకాడమీ విద్యార్థిని ఎ.వినూత్న ఎంపికైనట్లు కోచ్ బట్టు నాగరాజు తెలిపారు. తమిళనాడులో ఈ నెల 11 నుంచి 14 వరకు జరగనున్న జాతీయ స్థాయి పోటీల్లో ఆమె పాల్గొంటున్నట్లు చెప్పారు. సోమవారం కోచ్ ఆవరణలో ఆమెను అభినందించారు. కార్యక్రమంలో అకాడమీ గౌరవాధ్యక్షుడు అందె బాలచంద్రమౌళి, పలువురు క్రీడాకారులు పాల్గొన్నారు.

సర్వజ్ఞ సింధుకు సన్మానం



తెనాలిఅర్బన్: విద్యలో రాణిస్తూ పలు అవార్డులను సొంతం చేసుకుంటున్న చినరావూరు వాసి దివి సర్వజ్ఞ సింధు రానున్న రోజుల్లో ఉన్నత స్థితికి చేరుకోవాలని పండిత దివి రాంబాబు స్మారక ట్రస్ట్ సభ్యులు ఆకాంక్షించారు. తెనాలిలో ఆదివారం రాత్రి సింధును ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీటెక్ బయోటెక్నాలజీలో 92 శాతం మార్కులతో బంగారు పతకం సాధించిందని చెప్పారు. రెండు తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు నిర్వహించిన పీజీ సెట్‌లో 8,9 ర్యాంకులు సాధించినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎం.శ్రీనివాసమూర్తి, శ్రీనివాసకుమార్, టి.అనంతాచార్యులు, రామలింగేశ్వరరావు, రాధాకృష్ణమాచార్యులు, మాదవకుమార్ తదితరులు పాల్గొన్నారు.

• ఉత్సాహంగా గణేశుని ఉత్సవం


వెల్లటూరు కట్టమ్మతల్లి ఆలయం వద్ద పూజా కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

బాపట్ల, రేపల్లె, వేమూరు నియోజకవర్గాల్లో వినాయక చవితి ఉత్సవాలు ఉత్సాహంగా సాగుతున్నాయి. ఊరూవాడా వెలసిన చలువ పందిళ్లలో సోమవారం ఉదయం, సాయంత్రం స్వామికి ప్రత్యేక పూజలు జరిగాయి. కొన్నిచోట్ల భారీ అన్నసమారాధనలు జరిగాయి. పలుచోట్ల గణేశ్ నిమజ్జనోత్సవాలు అంగరంగ వైభవంగా జరిగాయి. – చెరుకుపల్లి/భట్టిప్రోలు/కొల్లూరు


భట్టిప్రోలు మండలం ఐలవరంలో ఊరేగుతున్న గణనాథుడు


కొల్లూరులో నిమజ్జనానికి వినాయకుడిని తరలిస్తున్న చిన్నారి భక్తులు


చెరుకుపల్లిలోని పొన్నపల్లి శ్రీగణేష్ యూత్ ఆధ్వర్యంలో గ్రామోత్సవం

వీడని వరద ముప్పు

- లంకల్లో అష్టకష్టాలు
- బాధితులను ఆదుకుంటున్న దాతలు, స్వచ్ఛంద సంస్థలు
- కానరాని ప్రభుత్వ సహాయక చర్యలు
- అధికారులు, ప్రజాప్రతినిధులు హడావుడి పర్యటనలతో సరి


భట్టిప్రోలు మండలం చింతమోటులో పశువుల చావిడిలోని వరద నీటిని తొలగిస్తున్న పాడి రైతు


భట్టిప్రోలు మండలం పెదలంక మధ్యగూడెం నుంచి కాకులడొంకకు వెళ్లే రహదారిలో పారుతున్న వరద నీరు

భట్టిప్రోలు: లంక గ్రామాలను వరద ముప్పు ఇంకా వీడలేదు. మళ్లీ ప్రకాశం బ్యారేజీ నుంచి నీరు దిగువకు విడుదలవుతుండడంతో ప్రజలు భీతిల్లుతున్నారు ఇప్పటికే ప్రజలు అష్టకష్టాలు పడుతున్నారు. ఇళ్లను, సామగ్రిని శుభ్రం చేసుకుంటున్నారు. కుటుంబాలకు, కుటుంబాలే చితికిపోవడంతో ఏమి చేయాలో పాలుపోక సాయం కోసం ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వ సహాయక చర్యలు అంతంతమాత్రంగానే సాగుతున్నాయి. అధికారులు, ప్రజాప్రతినిధులు పర్యటనలకే పరిమితమవుతున్నారు. దాతలు, స్వచ్ఛంద సంస్థలు వెల్లువలా సాయం అందిస్తున్నారు. వైద్యారోగ్యశాఖ సిబ్బంది గ్రామాల్లో వైద్యశిబిరాలు తూతూమంత్రంగా నిర్వహిస్తున్నాయి. పంచాయతీ సిబ్బంది పారిశుద్ధ్య పనులు చేస్తున్నారు. పెదలంక మధ్య గూడెం నుంచి కాకులడొంకకు వెళ్లే రహదారి మార్గంలో వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తోంది.

500 మందికి భోజనం పంపిణీ



భట్టిప్రోలు మండలం వెల్లటూరుకు చెందిన ఎమ్మార్సీటీ నిర్వాహకులు, పాస్టర్ పల్లికొండ రత్నం అండ్ బ్రదర్స్ సోమవారం తిప్పలకట్టలో 500 మందికి భోజనం పంపిణీ చేశారు. 8 రోజులుగా భోజనం ప్యాకెట్లు అందించామని సోమవారం నుంచి భోజనం పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో పాస్టర్ ప్రకాష్‌రాజు, రమేష్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు చేయూత

రేపల్లె రూరల్: పిన్నవయస్సులో విద్యార్థులు సేవా దృక్పథాన్ని అలవరుచుకోవలని రామకృష్ణ పబ్లిక్ స్కూల్ కరస్పాండెంట్ కుర్రా అవర్ణ చెప్పారు. కృష్ణా వరద ముంపు బాధితులకు రామకృష్ణ పబ్లిక్ స్కూల్ యాజమాన్యం, స్కూలు విద్యార్థులు, తల్లిదండ్రుల సహకారంతో మండలంలోని బొబ్బర్లంక పంచాయతీ కార్యాలయంలో సోమవారం ఎస్టీ కాలనీ వాసులకు చేయూతనిచ్చారు. ఈ సందర్భంగా బాధితులకు వస్త్రాలు, వంట సామగ్రిని అందజేశారు.



పంట పొలాల పరిశీలన



వేమూరు(అమర్తలూరు): ముంపునకు గురైన పంటలను కాపాడుకోవాలని బాపట్ల వ్యవసాయ పరిశోధన కేంద్ర శాస్త్రవేత్త మీనాక్షి చెప్పారు. అమర్తలూరు మండలంలోని ఇంటూరు, ప్యాపర్రు, మోపర్రు గ్రామాల్లో నీట మునిగిన పొలాలను వ్యవసాయాధికారి ఉయ్యూరు లోకేశ్వరి, బాపట్ల ఉప్పు నీటి పరిశోధకురాలు అన్నే మృధులతో కలిసి సోమవారం ఆమె పరిశీలించారు. నీరు బయటకు పంపి పంటలను కాపాడుకునే విధానాల గురించి రైతులకు వివరించారు.

పంట పొలాల పరిశీలన

వేమూరు: చుండూరు మండలంలోని మండూరు, ఆలపాడు గ్రామాలు, వేమూరు మండలంలోని కోడిపర్రు, పెనమర్రు, అబ్బనగూడవల్లి, కొల్లూరు మండలంలోని రావికింపాడు గ్రామాల్లో పంట పొలాలను ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు సోమవారం పరిశీలించారు.

దాణా పంపిణీ



కొల్లూరు : పశుపోషకులకు సంగం డెయిరీ ఉచితంగా అందజేసిన దాణాను వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు సోమవారం మండలంలోని జువ్వలపాలెంలో పంపిణీ చేశారు. రావికంపాడులో దెబ్బతిన్న వరి పొలాలను పరిశీలించారు.

గ్రీవెన్స్‌కు మూడు అర్జీలు


ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న ఆర్డీవో హెలా షారోన్

రేపల్లె రూరల్: ప్రజా సమస్యల పరిష్కార వేదిక(గ్రీవెన్స్)లో ప్రజలు తమ సమస్యలు పరిష్కరించుకోవచ్చని ఆర్డీవో హెలా షారోన్ అన్నారు. పట్టణంలోని రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె ప్రజల నుంచి అర్జీలను స్వీకరించి మాట్లాడారు. స్థల సర్వే కోసం పట్టణంలోని 9వ వార్డుకు చెందిన ఆలపాటి రమేష్‌బాబు దరఖాస్తు చేసుకున్నారని, స్థల సమస్యపై 27వ వార్డుకు చెందిన మంగనేని రత్తయ్య ఫిర్యాదు చేశారని, నివేశన స్థలానికి హద్దు దారి ఆక్రమణను తొలగించాలని 12వ వార్డుకు చెందిన ఒకరు అర్జీ అందించారని చెప్పారు. మూడు అర్జీలను పరిశీలించి సమస్యలను సంబంధిత శాఖల అధికారుల ద్వారా పరిష్కరిస్తామని పేర్కొన్నారు.

నిమజ్జనోత్సవాలకు పటిష్ట ఏర్పాట్లు

ఆర్డీవో హెలా షారోన్


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో హెలా షారోన్

రేపల్లె రూరల్: వినాయక విగ్రహాల నిమజ్జనోత్సవాలకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని ఆర్డీవో హెలా షారోన్ చెప్పారు. విగ్రహాల నిమజ్జనంపై డివిజన్ పరిధిలోని వివిధ శాఖల అధికారులతో పట్టణంలోని డివిజనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. డివిజన్ పరిధిలో నిమజ్జన ప్రాంతాలను ముందుగా గుర్తించి అప్రమత్తంగా ఉండాలన్నారు. ముఖ్యంగా పెనుమూడి కృష్ణానదిలో అధిక సంఖ్యలో నిమజ్జనం జరిగే అవకాశం ఉన్నందున పోలీసులు, రెవెన్యూశాఖ అధికారులు మరింత అప్రమత్తంగా ఉండాలన్నారు. నిమజ్జన ప్రాంతంలో జేసీబీలు, గజ ఈతగాళ్లను ఏర్పాటు చేయాలని సూచించారు. నిమజ్జనాలలో భాగంగా జరిగే ఊరేగింపులతో ట్రాఫిక్‌కు ఎటువంటి అవరోధం కలగకుండా పోలీసులు చర్యలు చేపట్టాలన్నారు. అధికారులు సమష్టిగా పనిచేసి నిమజ్జనాలను సమర్థంగా నిర్వహించాలని కోరారు. సమావేశంలో ప్రత్యేక అధికారి పానకాలరావు, మున్సిపల్ కమిషనర్ సాంబశివరావు, తహసీల్దార్ ఎం.శ్రీనివాసరావు, పట్టణ సీఐ మల్లికార్జునరావు, రూరల్ సీఐ సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

నేడు డాక్టర్ నాయుడమ్మ అవార్డు ప్రదానోత్సవం



తెనాలి: ప్రపంచ ప్రఖ్యాత శాస్త్రవేత్త డాక్టర్ యలవర్తి నాయుడమ్మ స్మారక అవార్డు ప్రదానోత్సవం ఆయన జయంతి రోజైన మంగళవారం తెనాలిలో జరగనుంది. డాక్టర్ యలవర్తి నాయుడమ్మ సైన్స్ అండ్ టెక్నాలజీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సాయంత్రం నాలుగు గంటలకు కొత్తపేటలోని తెనాలి రామకృష్ణ కవి కళాక్షేత్రంలో ఏర్పాటయ్యే ప్రత్యేక సభకు ఫౌండేషన్ ఛైర్మన్ యడ్లపాటి రఘునాథ బాబు అధ్యక్షత వహిస్తారు. నైవేలీలోని ఎన్ఎల్‌సీ ఇండియా లిమిటెడ్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ మోటుపల్లి ప్రసన్న కుమార్‌కు ఈ స్మారక అవార్డు-2024ను రాష్ట్ర ఆహార, పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ చేతులమీదుగా బహూకరిస్తారు. చెన్నైలోని సీఎల్ఆర్ఐ చీఫ్ సైంటిస్ట్ డాక్టర్ స్వర్ణ వి.కాంత్ విశిష్ట అతిథిగా హాజరవుతారు. నాయుడమ్మపై జరిపిన వ్యాసరచన పోటీల్లో విజేతలకు అవార్డు ప్రదానోత్సవ సభలో నగదు బహుమతి, ప్రశంసాపత్రం అందజేస్తారు. గతంలో యలవర్తి నాయుడమ్మ ట్రస్ట్ ఆధ్వర్యంలో 23 ఏళ్లపాటు ఏటా జాతీయ/అంతర్జాతీయస్థాయిలో ఖ్యాతివహించిన శాస్త్రవేత్తలకు నాయుడమ్మ అవార్డును ప్రదానం చేసిన ట్రస్ట్ వ్యవస్థాపకుడు పి.విష్ణుమూర్తి పేరిట సభావేదికకు నామకరణం చేశారు. ఫౌండేషన్ వైస్‌ఛైర్మన్ కొత్త సుబ్రహ్మణ్యం, ఇతర సభ్యులు పర్యవేక్షిస్తారు.

పంట నష్టం నమోదుకు నేటితో ఆఖరు


నేలపాడులో రైతులతో ఏడీఏ ఉషారాణి

తెనాలి: అధికవర్షాలు, వరదలతో జరిగిన పంట నష్టం తాలూకు ఇన్‌పుట్ సబ్సిడీ (పెట్టుబడి రాయితీ) చెల్లింపునకు రైతు సేవా కేంద్రం సిబ్బంది పంట పొలాలను సందర్శించి రైతుల జాబితాలను తయారుచేస్తున్నారని వ్యవసాయశాఖ, తెనాలి ఏడీఏ ఉషారాణి వెల్లడించారు. సోమవారం ఆమె తెనాలి రూరల్ మండలంలోని గ్రామాలను సందర్శించారు. రైతులతో సమావేశమయ్యారు. పంట నష్టం ఎన్యూమరేషన్‌ను పరిశీలించారు. పంట నష్టం నమోదుకు 10వ తేదీ చివరి గడువుగా తెలిపారు. అనంతరం సంబంధిత రైతుల జాబితాలను 11వ తేదీ నుంచి సామాజిక తనిఖీ నిమిత్తం గ్రామాల్లో ప్రదర్శిస్తారని చెప్పారు. పెట్టుబడి రాయితీ పొందటానికి ఈ-క్రాప్ నమోదు తప్పనిసరిగా చెప్పారు. అందుచేత రైతు సోదరులు తమ పరిధిలోని రైతు సేవాకేంద్రం సిబ్బంది సంప్రదించి, నష్టపోయిన పంట వివరాలు, ఆధార్, బ్యాంక్ ఖాతాను నమోదు చేయించుకోవాలని కోరారు.

చిన్నారులు, మహిళలకు పౌష్టికాహారం తప్పనిసరి


పౌష్టికాహార ప్రతిజ్ఞ చేయిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది, ఉపాధ్యాయులు

రాయపూడి(తాడికొండ): ఆరోగ్యవంత సమాజాన్ని నిర్మించుకునేందుకు పౌష్టికాహారం తీసుకోవడం తప్పనిసరని ఐసీడీఎస్ సెక్టార్ సూపర్‌వైజర్ కె.సీతారావమ్మ చెప్పారు. తుళ్ళూరు మండలం రాయపూడి మండల పరిషత్ పాఠశాలలోని అంగన్‌వాడీ కేంద్రంలో ఏర్పాటు చేసిన పోషణ మహా కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన ఆహారం, ఇతర జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం ప్రసాద్, ఉర్దూ స్కూల్ హెచ్‌ఎం ఖాసిం, ఉపాధ్యాయులు సుజాత, గర్భిణులు, బాలింతలు, తల్లులు అంగన్‌వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులకు రుణమాఫీ చేయాలి



తాడేపల్లిరూరల్ : పంటలు నష్టపోయిన రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య డిమాండ్ చేశారు. సోమవారం తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం గుంటూరు జిల్లా విస్తృత స్థాయి సమావేశానికి రైతు సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షులు జొన్న శివశంకరరావు అధ్యక్షత వహించారు. వి.కృష్ణయ్య ముఖ్య అతిథిగా మాట్లాడుతూ రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. అన్నదాత సుఖీభవ పథకం ద్వారా ఇస్తామన్న రూ.20 వేల పెట్టుబడి సాయాన్ని అందించాలని, బీమా వర్తింపజేసి నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కౌలు రైతులనూ ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాగంటి హరిబాబు, ఏపీ రైతు సంఘం గుంటూరు జిల్లా కార్యదర్శి కంచుమాటి అజయ్ కుమార్, గుంటూరు జిల్లా ఉపాధ్యక్షులు పాశం రామారావు, రైతు సంఘం జిల్లా నాయకులు మొలక శివసాంబిరెడ్డి, జిల్లా సహాయ కార్యదర్శి కొత్త వెంకట శివరావు, మోదుగుల శ్రీనివాసరెడ్డి, చింతల భాస్కరరావు, కొర్రపోలు ఈశ్వరరెడ్డి, బ్రహ్మేశ్వరరావు, కుమారి తదితరులు పాల్గొన్నారు.


కట్నం వేధింపులపై కేసు నమోదు

తెనాలిరూరల్: వరకట్నం కోసం వేధిస్తున్న భర్తపై కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పట్టణ చినరావూరుతోటకు చెందిన గాజుల అలేఖ్య తనను భర్త వెంకటనాగచిరంజీవి కట్నం కోసం వేధింపులకు గురి చేస్తున్నాడని పోలీసులను ఆశ్రయించింది. వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉద్యాన సాగులో జాగ్రత్తలు అవసరం

- పొలాల్లోని వర్షపు, వరద నీరు బయటకు పంపాలి
- అధికారుల సూచనలు పాటించాలి


వరద నీరు బయట పంపిన అనంతరం దెబ్బతిన్న పసుపు పంట


మెట్ట ప్రాంతంలో వర్షాల కారణంగా పసుపు పంటలో నిలిచిన వర్షం నీరు

కొల్లిపర: కృష్ణా నది దిగువున లంక భూమిలో ఉద్యాన పంటలు సాగు చేస్తున్న రైతులు వరద నీరు, వర్షపు నీరు పొలాల్లో లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెనాలి ఉద్యాన విస్తరణ అధికారి పి.శ్రీధర్‌రెడ్డి సూచించారు. సోమవారం ఆయన పంటను కాపాడుకునే విషయమై పలు సూచనలు చేశారు. కొల్లిపర మండలాల్లో 2,500 ఎకరాలలో ఉద్యాన పంటలు సాగు చేస్తున్నారని, వర్షాలు వరదలు కారణంగా అరటి, పసుపు, కంద, కూరగాయల పంటలు బాగా నీటిలో నానిన విషయాన్ని గమనించానన్నారు. అయితే దిగుబడి నష్టపోకుండా రైతులు జాగ్రత్తలు, సలహాలు, సూచనలు పాటిస్తే మంచిదని ఆయన సూచించారు.

ఇలా చేయాలి

- పొలాల్లో నిలువ ఉన్న అదనపు నీటిని బయటకు పంపివేయాలి
- మొక్కలు బలంగా పెరగడానికి పోషకాల మోతాదులు పెంచాలి
- వ్యాధికారక శిలీంధ్రాలను, చీడలను నివారించడానికి తగిన చర్యలను చేపట్టాలి.

అరటిలో జాగ్రత్తలు ఇలా..

- ఈదురు గాలులకు విరిగిపోయిన అరటి తోటలలో గెలలు ఉన్నట్లయితే వాటిని కోసి మార్కెట్ చేసుకోవాలి.
- లేత అరటి తోటలు (5-7 నెలల వయస్సు) విరిగిపోయినట్లయితే అలాంటి తోటలను శుభ్రం చేసి కొత్త పిలకలను వదులుకోవాలి. వదిలిన పిలకలకు ప్రతి 25 రోజులకు ఒక సారి మొక్క ఒక్కింటికీ 100 గ్రాములు యూరియా, 80 గ్రాముల మ్యూరేట్ ఆఫ్ పోటాష్ వేయాలి
- 2 లేక 3 నెలల వయస్సు ఉన్న అరటి మొక్కలు విరిగిపోయినచో, విరిగినచోట కోసివేసి మరలా ఆ మొక్కలను పెంచవచ్చును. అరటి దుంపలు కుళ్ళిపోకుండా కాపర్ ఆక్సీక్లోరైడ్ 3గ్రా లీటరు నీటికి కలిపి లేదా బోర్డో మిశ్రమం ఒకశాతం దుంప చుట్టూ తడిచేరేటట్లుగా నేలలో పోయాలి.

పసుపు పంటలో జాగ్రత్తలు

- వర్షపు నీరు బయటకు పూర్తిగా పంపించివేయాలి
- వర్షాలు ఆగిన వెంటనే పంటపై లీటరు నీటికి 5గ్రాముల, పొటాషియం నైట్రేట్ కలిపిన ద్రావణాన్ని వారం రోజుల వ్యవధిలో 2-3 సార్లు పిచికారి చేయాలి.
- పంటలో ఇనుప ధాతులోపం ఏర్పడి లేత ఆకులు పాలిపోయినట్లు కనపడితే , 10 లీటర్ల నీటిలో 50 గ్రాముల చొప్పున అన్నభేది ఒక నిమ్మ చెక్క రసం, జిగురు మందుతో కలిపి 15 రోజల వ్యవధిలో రెండు సార్లు పిచికారి చేయాలి.
- నేల అదునుకు వచ్చిన వెంటనే అంతర కృషి చేసినట్లయితే త్వరగా ఆరుతుంది. పైపాటుగా ఎకరానికి 50 కిలోల యూరియా, 40 కిలోల పొటాష్‌తోపాటు 200 కిలోల వేప పిండి వేయాలి.

నీరు నిల్వ లేకుండా చూడాలి



రెండు, మూడు రోజుల పాటు సాధారణ స్థాయి కన్న ఎక్కువ శాతం వర్షం పడిన సమయంలో అరటి, పసుపు వంటి పంటలో వర్షం తగ్గిన వెంటనే నీరు నిల్వ లేకుండా రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలి. అనంతరం వ్యవసాయాధికారులు, ఉద్యాన శాఖ అధికారులు, శాస్త్రవేత్తలు తెలిపిన విధంగా తగు చర్యలు తీసుకోవాలి. అప్పుడే పంటకు ఎటువంటి నష్టం జరగకుండా ఉంటుంది.

పి.శ్రీధర్‌రెడ్డి, తెనాలి ఉద్యాన విస్తరణ అధికారి